

# రోదసిలో మానవుడు

కొవ్విపాక మధుసూదనరావు

వియన్మండలంలో చంద్రుడూ, చంద్రికా ఏకాంత ప్రదేశంలో పరస్పర ప్రణయ సల్లాపాలలో ఒండొరులు మరులు గొల్పుతూ పరవశించి ఉంటారు. అమృత కిరణుడు, తన బాహుపరిరంభంలో చంద్రికను గాఢంగా హత్తుకొని ఉంటాడు.

చంద్రుడు:—నేడు ఎంత అందంగా ఉన్నావు చంద్రికా...!

చంద్రిక:—అలాగా మనోహరా...!

చంద్రుడు:—నిజం చంద్రికా...! అతిలోక మోహనమైన నీ అందం నన్ను పిచ్చివాణ్ణి చేస్తూన్నది. నా ప్రణయ లోకాన్ని నిరుపమానమైన అందాల వనిలా మార్చి నీ అందం, నీ బంధం నన్ను చరితార్థుణ్ణి చేస్తున్నాయి.

చంద్రిక:—నిజంగానా రాజా! అయితే నే నెలా ఉన్నా నంటారు?

చంద్రుడు:—దేవీ!.... నీవు అచ్చంగా అద్దంలో కనుపించే నా నీడలా ఉన్నావు... ఇంతెందుకు? దేవీ! నీవే నేను... నేనే నీవు...

చంద్రిక:—రేరాజా! ప్రణయాతిరేకంలో వరాకు చిత్తగిస్తున్నట్లున్నారు.

చంద్రుడు:—లేదు దేవీ!...నీకు వినా ఈ వెన్నెల లేదు లేదు...

చంద్రిక:—నెలరాజా! ఒకసారి మీ హృదయ పీఠాన్ని పరికించండి.... మీకే తెలుస్తుంది,

మీలో నేను లేని చోటు...

చంద్రుడు:—ఏది దేవీ...! కనుపించడంలేదు. నీవే చెప్పు.....

చంద్రిక:—రేరేడా....! మీరే చూచుకోండి. గుండెమీద....

*[చంద్రిక, చంద్రుడి గుండెమీద వ్రేలెట్టి చూపుతుంది. చంద్రుడు చిరునవ్వు నవ్వుతూ]*

చంద్రుడు:—రాణీ! నీలాంఛనం లీలగా కనుపించడం లేదూ? నీవులేని లోపాన్ని ఎంతమాత్రం ఎత్తిచూపడం లేదు. పైగా నా బాహ్యాంతర సీమల్లో అధివసించిఉన్న నీ అందానికి ఆకర్షణ కలిగిస్తూంది. ఇంతకూ నాకు లేని సందేహం నీ కెందుకు వెన్నెల బాలా!

చంద్రిక:—సుధాకరా! ఇంతకూ నా సందేహానికి అర్థం అది కాదు. నీ అందానికి పరవశం చెందేది నే నొక్కర్తెనే కాదు. ఈ యావత్తారా సందోహం కూడా మిమ్ము ప్రాణప్రదంగా ప్రేమిస్తున్నది. మీరు తారామనోహరులు కాదా, చంద్రా!

చంద్రుడు:—(సానులాపంగా).... చంద్రికా! నా హృదయవాపిలో నీవు నిరంతరం కురిసే అమృతజ్యోత్స్నల్నే తారాసందోహానికి పంచియిస్తున్నాను. నీవు నా మనస్సుకు ప్రసాదించే చల్లదనంతోనే భూలోకంలో కాంతిమంతమైన చలువపందిళ్లు వేస్తూ ఉన్నాను. నా కన్నులలో నిండు కట్టిన నీ రోచిర్నిష్యందినినే కలకంఠుల కడకన్నులలో కాపురం పెట్టిస్తూన్నాను. ...చంద్రికా....! నీవు లేని చంద్రుడికి అపూర్వమైన అలంకారికోపమ మాత్రం ఎలా చెల్లుతుంది....? నీవే నా ప్రాణానివి... ప్రణవానివి.... ఆకృతివి....

*[చంద్రిక పరవశంతో సుధాకరుణ్ణి చేతులతో చుట్టివేసుకుంటుంది. సుధాకరుడు వెన్నెలవడతి మోములో మోము పెట్టి, ఆమెను కరావలంబితం చేసుకుంటాడు. తిన్నగా ఒక మబ్బుపరదా వారి ప్రణయవరణానికి దడికట్టింది. బయట ఇంచుకంత స్పష్టాస్పష్టంగా కొన్ని పురుషకంఠాలకుంఠిత ధ్వనులు, సుధాకరుని శ్రవణకుహరంలో ప్రవేశిస్తాయి.]*

చంద్రుడు:—చంద్రికా....!

చంద్రిక:—మనోహరా....!

చంద్రుడు:—విను.... ఏదో కలకలం...!

చంద్రిక:—అంతరంగంలోనా....?

చంద్రుడు:—కాదు చంద్రికా! అదుగో.... విను....

*(ధ్వనులు స్పష్టంగా వింపిస్తాయి)*

చంద్రా....! సుధాకరా....! తారా మనోహరా!

# రోదసిలో మానవుడు

రేరాజా....!

చంద్రుడు:—వింటున్నావా రాణీ....! ఆవిరుతింపులు.... ఏదో ఆందోళనావహమైన ఆఘటన ఘటనాసన్నివేశం కానోవు.

చంద్రిక:—(కోపంతో) ఎవరా ఛిన్నరసికులు? ఎందుకా విరుతింపులు....?

చంద్రుడు:—ఆగ్రహించకు రాణీ...! చలువల దొరసాని కంతపాటి ఆగ్రహం కూడదు.

చంద్రిక:—కాస్త నిగ్రహించుకోండి.

*[బయట కంఠారావాలు హెచ్చుతాయి. సుధాకరుడు, చంద్రిక అంసద్వయాన్ని వీడి అంతఃపుర ప్రాంగణంలోకి వస్తారు]*

చంద్రుడు:—ఎవరదీ...?


కంఠాలు:—చంద్రా....! సుధాకరా...! మేము గ్రహ రాజులం.

చంద్రుడు:—ఏమిటి గ్రహరాజులారా! అలా ఆందోళన చెందుతున్నారు? వచ్చిన ఆపద సెలవీయండి.

బుధుడు:—వెన్నెలరేడా! మహోత్పాతం... అమృతభాండంలో హాలాహలం... మధుపాత్రలో వార్బిందు పతనం... చలువలు దొరా! ఇది మన వియన్మండలం అంతటికీ అశనిపాత మహాఘాతం. రేరాజా! ఈ ప్రమాదా న్నెదుర్కొని,తమ విశాల సితాతపత్ర శీతల చ్ఛాయల్లో ప్రశాంతంగా ఉన్న మన సామ్రాజ్యాన్ని సురక్షితం చేసుకోవాలి.

చంద్రుడు:—(సునిశితంగా) బుధాగ్రణీ! చిత్రంగా ఉంది మీ వాగ్ధోరణి... (గ్రహకూటమి నుద్దేశిస్తూ) ఎందుకంత కంగారు పడతారు...? కొంచెం అబ్బురపాటును విసర్జించండి... ఏర్పడబోయే ప్రమాదాన్ని స్పష్టంగా వివరించండి... శనైశ్చరా! మిన్నకున్నావేం...? అంగారకా...! అలా మండిపోతున్నావేం...? శుక్రా! కుంచించుకుపోతున్నావేం? గ్రహముఖ్యులారా! శాంతాన్ని పాటించండి....జరుగబోయేది ఆసాంతం విశదీకరించండి.

శనైశ్చరుడు:—సుధాకరా ! సహచరులమీద అంత తేలికభావం కూడదు.



అంగారకుడు:—రవరాట్టు దృష్టి కొంత రాజ్యాంగ విషయాల పట్ల కూడా అవసరం.

శుక్రుడు:—చంద్రా! వెన్నెల చేలాంచలాల్ని వీడిరా...నీ సుధాలోక సంక్షయ కారకమైన మహా సంచలనం మనస్సు కంటే వేగంగా పరుగెత్తుకొస్తూంది.

*[చంద్రిక సుధాకరుడి వ్రేలిసందున కీలితమైఉన్న తన చేలాంచలాన్ని విసురుగా లాక్కుంటుంది.]*

చంద్రుడు:— వెన్నెలా...! మనోహరీ!... (కొంచెం పరుషంగా) శుక్రా! జ్ఞానవృద్ధుడివి!... ఏమిటా అసంబద్ధ వాగ్గుంభన....అంగారకా...! శనీ....! చాలించండి మీ వాచాలత్వం... సూటిగా చెప్పండి.

అంగారకుడు:—శశాంకా! సూటిగా మీరే వినండి.

*[మెల్లిగా నభోంతరాళాన్ని చీలుస్తూ అంతకంతకు తమదికే ముంచుకొస్తున్న ధ్వని]*

అంగారకుడు:—వింటూన్నారా సుధాకరా! ప్రళయధ్వని.

చంద్రుడు:—(సాలోచనగా) ఈ వింటూన్నాను అంగారకా!

అంగారకుడు:—శరచ్చంద్రా...! దురాక్రమణాన్వితమైన ఇట్టి విపరీత చేష్టితాలు, కుహనా వ్యాపారాలు మానవులకు పరిపాటి అయిపోయింది.

శని:—కాదా మరి అంగారకా! మన అమర్త్యశేఖరుల శీతల దయార్ద్రకృపాధారలమే వారికి అమృతాంధసాప్తిని కలిగించి మత్తెక్కింప జేసింది. కోతికి కొబ్బరి కాయ దొరికితే ఎలాఉంటుంది అంగారకా?

శుక్రుడు:—పెద్దల మాటలు పెడచెవిన బెడుతూండబట్టే మానవులకంటే దేవతలకే ఆపదలు ఎక్కువగా వస్తాయి.

శని:—అస్మదాదుల్లో సామరస్యం కుదిరితే ఇల్లాంటి విపరీతాలకు తావుండదు. చంద్రా! నా మాట విను....వెడదాం పద. ఆ మర్త్య కొంకాన్ని మళ్లించి పంపుదాం.

చంద్రుడు:—(కోపంతో) శనీ...!

శని:—చంద్రా!

చంద్రుడు:—దూరాలోచన ఇంచుకంత అవసరం. శనైశ్చరా...! ఆ వచ్చేది మానవుడు.... వాడు మనవాడు.

బుధుడు:—దూరాలోచన అవసరం సుధాంశూ! ఆ వచ్చేది దానవుడు కాదని మాకూ తెలుసు....! అందుకేగా మనవిచేస్తున్నాము. ఇది మన ప్రతిష్ఠా సమస్య... విపక్ష కూటమిని స్వపక్షంగా భావించి విశ్వసించ మనడం తమ ఏలిక తనానికే తేలికతనం. అతి గహనమైన గగన రహస్యాలను గంగపాలు చేసుకున్న వాళ్ళ మవుతాము.

చంద్రుడు:—బుధా...! మన వియన్మండల వ్యవస్థ పట్ల మీరు కూడా అంత అస్థిరభావం ప్రకటిస్తున్నారు. మన సామ్రాజ్యం శత్రు దుర్భేద్యం.

బుధుడు:—ఇప్పటివరకూ అలానే ఉంది. మానవ ప్రవేశానంతరం అది వజ్ర వినిర్భిన్నం.

శని:—శత్రు నిర్భేద్యమైన గగన కటాహానికి ఏనాడో చిల్లుపడింది. నెయ్యం నటించి, అన్యుల రహస్యాల్ని ఛేదించి, కయ్యానికి కట్టి బిగించే కూట యుద్ధ పరులను వారి స్థానంలోనే ఉంచటం సభా మర్యాద.

అంగార:— సోదరులారా! రాజు ధర్మం తప్పినా రాజభక్తిపరాయణులం మనం మిన్న కుండరాదు. ఇప్పుడే వెడతాను. కణకణ మండే నా ఆభీల దావాగ్నిజ్వాలల్లో ఆ మానవాధముణ్ణి భస్మీపటలం చేస్తాను.

చంద్రుడు:—అంగారకా....!హద్దుల్ని అతిక్ర మిస్తున్నావు...వేగిరపాటు కూడదు. దురావేశము పరితాప హేతువు. పిచ్చుకపై బ్రహ్మాస్త్ర ప్రయోగం వెడగుబాటేకాదు. దివ్యశక్తుల దుర్వినియోగం కూడా....! ఎన్ని గుణపాఠాలు చదువుకున్నా ఒంటబట్టకపోవడం ఈ లోకం దురదృష్టం.... గ్రహరాజులారా! సావధాన మన స్కులు కండి! ఇప్పుడు పుట్టి మునగబోయే ప్రమాదం ఏమీ లేదు... మీరు చెబుతూన్నట్లు, ఆ మనుష్య శాబకం ఇప్పట్లో మనను చేరలేడు. ....అయితే చేరగలడు. మన ప్రేమపూర్వకమైన స్వాగత సత్కారాలు అనతి కాలంలోనే అందుకో గలడు. మనం మన అతిథిని తప్పకుండా స్వాగ తింతాము. ప్రేమ ఈశ్వర శక్తి. మనం అందరం తదీయ అనువర్తులం. ప్రేమయొక్క ఆకర్షణ శక్తివల్లనే మనందరి ఉనికి స్థిరత్వాన్ని పొందిన సంగతి విస్మరించకండి.... గ్రహరాజులారా...! మీరు నిగ్రహానుగ్రహ సమర్థులు. మీ శుభాశుభ వీక్షణాల ననుసరించి సంచరించే చిరంజీవులపట్ల ఆగ్రహించడం మనపై మనం అపకారం చేసుకో ప్రయత్నించినట్లే.

*[గ్రహకూటమి ఒక్కటిగా]*

రేరాజు స్వీయ ప్రయోజనలంపటులై అన్న దాదులను సమ్మతింపజేయజూస్తున్నారు.

బుధుడు:—భూలోకంలో మీకూ మీ చలువల రాణికీ కలుగుతున్న ఆదర. సత్కారాలు సన్నగిల్లుత వనే ఆందోళనయే మీ విరాధ్రుతికి కారణము.

*[కోపంతో చంద్రిక ప్రవేశం]*

చంద్రిక:—మీ అనుచితోక్తులు అంత స్థులు మీరుతున్నాయి. అంతస్థులు మీరిన ఈ అవజ్ఞాకృతిని ఈ చంద్రిక సహించజాలదు. ప్రాణప్రియా! అనవసరంగా నన్ను రచ్చకీడు స్తున్న ఈ గ్రహకూటమికి తగిన పాఠం చెప్పి పంపించండి....!

చంద్రుడు:—చంద్రికా...! గ్రహరాజులు మన శ్రేయోభిలాషులు... ప్రజ్ఞానిధులు... వారి ప్రేమపాత్రమైన ఉక్తి చమత్కృతులే కాని, పరుషోక్తులు కావు.

చంద్రిక:—ప్రాణప్రియా! గ్రహకూటమికి మర్త్యులపై ఇంత ఆగ్రహోదగ్ర వీక్షణం ఎందుచేత?...

చంద్రుడు:—ఆగ్రహం మాత్రమే కాదు... మర్త్యులపై చెప్పరాని అనుగ్రహం కూడా.

*[గ్రహకూటమి శాంతిచిత్తం వహిస్తుంది]*

శని:—సోదరులారా! రేరేని మృదువర్మోక్తులు వింటున్నారా! మీరంతా చల్లబడి పోయారు. నాకు తెలుసు. మనలో ఏకీకృతి కలిగితే....

అంగారకుడు:— (ప్రస్ఫుటంగా) శనైశ్చరా! నేను నీతో ఏకీభవిస్తున్నాను. నేను దిగజారి పోలేదు.

బుధుడు:—అంగారకా! శనైశ్చరా! త్వరపడ కండి.... మనం వ్యతిరేకించేది మన సుధా కరుణ్ణికదా! సుధాకరుడు మన నెయ్యుడు. మన సన్నిహిత బంధువు, మన పాలకుడు... అమృత మూర్తికి అప్రియం కలిగిస్తే మన జీవితాలు బీటలువారిపోతాయి. ప్రేమ బంధువైన సుధాకరుణ్ణి దూరం చేసుకోవడం, ప్రేమశక్తి యైన ఈశ్వరుణ్ణి దూరం చేసుకోవడమే. మర్త్యుల్లోనే దురాగ్రహాలూ, పరస్పర మారణ క్రియలూ, దుర్వ్యయా కాంక్షలూ అంతరి స్తున్నాయి. పుడమిని శాంతి స్వర్గంగా ఏలుకునే నవ్యయుగం భూలోకంలో ఆరంభమైంది. ఈ శాంతి మహా కృషిలో, లీనమై విశ్వమహా శక్తితో నెయ్యం కట్టే మానవులు మనకు మిత్రులు మాత్రమే కాదు. పరమాత్మీయులు కూడా. అంతే నంటారా చంద్రా!

*[చంద్రుడు చిరుహాసంతో చంద్రిక ముఖమండలాన్ని దర్శిస్తాడు. చంద్రిక లజ్జావనతముఖి అవుతుంది.]*

చంద్రుడు:—విబుధాగ్రగణ్యుడైన బుధుడు చెబుతున్న వేదాంతం వింటూన్నావా చంద్రికా!

చంద్రిక:—వేదాంతం మాత్రమే కాదు. జ్యోతిషం కూడా... అన్నీ తెలిసుండీ బుధుడు ఇలా కూటమికి నాయకత్వం వహించి, అల్లరి పరచడం దేనికి?...

చంద్రుడు:—(క్రీగంటితో గ్రహరాజులవేపు చూస్తూ) అల్లరి కాదు దేవీ! హాస్య వల్లరి...

*[సభ్యుల మౌనాన్ని చూచి, శుక్రుడు, శని, అంగారకుడు మొహం చిన్నబుచ్చు కుంటారు]*

చంద్రుడు:—గ్రహరాజులారా! భూలోక వాసుల జీవన విధానంలో అనేక అభ్యుదయ కర మైన మార్పులు వస్తున్నాయి. ఒకరి నొకరు బూదిచేసుకునే నిర్మూలనాత్మక క్రియాపాటవం నుండి బుద్ధి మరల్చుకొని నిర్మాణాత్మకమైన శాంతిని స్థాపించుకోవలెననే నాగరకుల సంఖ్య అసంఖ్యాకంగా పెరిగిపోయింది. మానవులు తమ యీ శాంతి ప్రయత్నంలో నిమగ్నులై అత్యంత త్యాగ యుక్తమైన జీవితా న్నలవరచుకొని ధన్యులవుతున్నారు. ఆ ప్రయత్నంలోనే మనతో నేస్తం కట్టి మన సౌహార్దాన్ని సంపాదింపజూసే మానవ మహాశయుడు మన ఆతిధ్యానికి వస్తూ న్నాడు. మనం అతని మహదాశయానికి సహక రిస్తే! అంతకన్నా కావలసిందేముంది...?

*[గ్రహకూటమిలో వెనుకనుంచి శుక్రుడు, శని]*

శశాంకా! అయితే ఆ మానవుడికి మహత్స్వా గత మిద్దాం పదండి! సోదరులారా!

*[చంద్రుడు, చంద్రిక పాణి పల్లవాన్ని స్పృశిస్తూ]*

చంద్రుడు:—సోదరులారా! తొందరపడకండి... (బుధుడివేపు ఓరగాచూస్తూ) 'ఇదిమన ప్రతిష్ఠ సమస్య.'

బుధుడు:—భలే! చమత్కరించారుచంద్రా!

చంద్రుడు:— (ఫక్కున నవ్వుతాడు) గ్రహ రాజులారా! మన గౌరవాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి గదా! అంత తేలిగ్గా మనం ఇతరు లకు స్వాగత సత్కారాలు ఇవ్వగూడదు. అపూ ర్వమేధా నిధులైన మనీషుల అర్హస్థాయిని గమ నించిన మీదటనే వారికి మన ఘనమైనస్వాగతం ఇవ్వబడుతుంది. అంతవరకూ వారి యత్నాల పట్ల మన సంపూర్ణ సానుభూతి సౌహార్దాలు ఉంటాయి.

గ్రహకూటమి (తమలో): ఆ ప్రళయం మాటేమో కాని మనం అంతా ఒకచోట కూడి ఇలాగే వుంటే జగత్ప్రళయమే జరుగుతుంది.. పదండి....

చంద్రిక:— (చిరునవ్వులు చిందిస్తూ) మీరు ఎంత అమృత మయులు సుధాకరా!

చంద్రుడు:— ఆ అమృతం అంతా, నీవే చంద్రికా!... ★

## అలవాటు

కష్టాలతో తలమునకలుగా ఉన్న ఒక ఆసామీ తన భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలుసుకోవాలని ఒక జ్యోతిష్కుని దర్శించాడు.

"ఆరుమాసాలవరకు నీకీ కష్టాలు తప్పవు, నాయనా" అన్నాడు జ్యోతిష్కుడు.

"ఆతరువాత ఎలా ఉంటుంది స్వామీ?" అని ఆశతో ప్రశ్నించాడు ఆ ఆసామీ.

జ్యోతిష్కుడు:— "అలవాటు పడిపోతావు, నాయనా."

కె. ఎస్. ఆర్. కృష్ణ
(విజయవాడ—2)